క్లుప్తంగా

10న మున్సిపల్ సమావేశం

రామచంద్రపురం: ఈనెల 10న సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పామర్రులో చంద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సూర్యప్రకాష్ తదితరులు

కె.గంగవరం: ఇటీవల తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు. మండలంలోని పామర్రులో కుడుపూడి చంద్రరావు భార్య కుడుపూడి సీతారత్నం (69) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దీంతో పాటు కె.గంగవరం గ్రామానికి చెందిన పెంటపాటి చిన్న(30) ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

కె.గంగవరం: మండల కేంద్రమైన కె.గంగవరం ఐకేపీ కార్యాలయ ఆవరణలో నేడు సచివాలయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిశోరి వికాస శిక్షణ కార్యక్రమానికి సచివాలయంలోని ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు ఈ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రామచంద్రపురం రూరల్: నేటి ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ×డయల్ యువర్ డిపో మేనేజర్≀ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు, ప్రజలు తమ సలహాలు, సూచనలు తమ ఫోన్ నంబర్లు 99592 25536, 08857 848004లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ప్రజల సలహాలు, సూచనల మేరకు మరింత మెరుగైన సేవలు తమ డిపో నుంచి అందించడానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు మండల సమావేశం

కపిలేశ్వరపురం: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రత్నకుమారి తెలిపారు. ఉదయం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన నిర్వహించనున్నారని, సమావేశానికి శాఖాపరమైన సమాచారంతో హాజరుకావాలని ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి



అంగరలో ఆటో డ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై రవికుమార్

కపిలేశ్వరపురం: వాహనాలను నడుపుతున్న సమయంలో ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని అంగర ఎస్సై డి.రవికుమార్ ఆటో డ్రైవర్లను ఆదేశించారు. సోమవారం అంగర గాంధీ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనం నడినవారిపై చట్టపరిధిలో కేసులు నమోదు చేస్తామన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. పరిమితి మేరకు ప్రయాణికులను ఆటోలోకి అనుమతించరాదని, సంబంధిత రికార్డులను విధిగా వాహనంలో ఉంచాలని ఎస్సై చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



రాయవరంలో వృద్ధులను సత్కరించి, దుప్పట్లు అందజేస్తున్న యువచైతన్య యూత్ సభ్యులు

రాయవరం: గ్రామంలోని యువచైతన్య యూత్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. యూత్ క్రిస్మస్‌లో భాగంగా దళితపేటలోని వంద మంది వృద్ధులను సత్కరించి, వారికి దుప్పట్లు అందజేశారు. జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి సౌజన్యంతో రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వార్డు సభ్యుడు లంక చందు, స్థానిక నేతలు పలివెల నాగేశ్వరరావు, చంద్రమళ్ల సునీల్, పెదపాటి శాంతరాజు, దువ్వా చంద్రశేఖర్, యువచైతన్య యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగ్గులు.. సంప్రదాయానికి ప్రతీకలు

- మగువలు మెచ్చిన రంగ వల్లులు
- ధనుర్మాసంలో ముగ్గుకు పెరిగిన ప్రాధాన్యం
- సంప్రదాయతకు సాంకేతికత తోడు
- సృజనాత్మకంగా ముగ్గుల మోడళ్లు



మాచరలో ముగ్గులు మధ్య ముద్దుగుమ్మలు



అందంగా అద్దిన ముగ్గు

కపిలేశ్వరపురం: పచ్చని పొలాలు.. గలగలపారే గోదావరి.. అమ్మవార్ల జాతరలు.. దేవతామూర్తుల దేవాలయాలు.. వ్యవసాయ సాగు.. చేనేత మగ్గం చప్పుళ్లు.. పాడి పశువుల పరుగులు.. ఇంటి ముందు ముగ్గులు.. ఇలా అటు గతకాలపు జీవన విధానం, ఆధునిక నడవడిక కలసి మెలసిన ప్రాంతాల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని 120 గ్రామాల్లో పల్లె పద్ధతులు దర్శనమిస్తున్నాయి. ధనుర్మాస ప్రాశస్త్యంలో అత్యంత ప్రధానమైనది ముగ్గు. ఇది ప్రతి ఇంటా కనువిందు చేస్తుంది. మహిళలు అమితంగా ఇష్టపడే ముగ్గులు వేసే ప్రక్రియ వెనుక పలు శాస్త్రీయ అంశాలెన్నో ఉన్నాయి. ముగ్గులు అద్దడం మానసిక, శారీరక శ్రమకు తార్కాణం. ఒకరి భావాలను మరొకలు పంచుకుంటుండడంతో మహిళల మధ్య ఐక్యత నెలకొంటుంది. ముగ్గుల లోగిళ్ల తీరు తెన్నులపై ఈ కథనం..

ముగ్గుల నేపథ్యమిదీ

ధనుర్మాస నెలపొడుపున ప్రారంభమై భోగి రోజుతో ముగ్గులు పెట్టడంతో ముగియనుంది. పెళ్లీడు అమ్మాయిలు తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లతో పూజలు చేయడం ద్వారా మంచి వరుడు లభిస్తాడని ఆండాళ్ తల్లి పావన చరిత్ర ద్వారా తెలుస్తోంది. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతికి పూర్ణ కుంభం, కనుమకు రథం ముగ్గు వేయడం ఆనవాయితీగా వస్తోంది.

ముగ్గుల్లో మెళకువలెన్నో..

చేతి వేళ్ల మధ్యల్లోంచి ముగ్గును జార విడుచుతూ వేసే పద్ధతి సాధారణమైంది. అనాదిగా వస్తున్న ఈ పద్ధతికి తోడు ఆధునిక కాలంలో అనేక నూతన పద్ధతులు ఉనికిలోకి వచ్చాయి. ముగ్గుతో పాటు రంగు రంగు పౌడర్లు, పెయింట్లు, బ్రష్‌లు, జల్లెడ ముగ్గు, డబ్బా ముగ్గులు, అచ్చు, మెట్లుపై స్టిక్కర్లు, ఆరు తిక్, మరో ఆరు లైట్ మొత్తం 12 రకాల రంగులు కొనుగోలు చేస్తున్నారు. తమ ముగ్గులను చుక్కలు, మెళికలు, డిజైన్స్, హాస్యం బొమ్మలు, కూరగాయలు, దేవతా మూర్తులు, సంగీత సాధనాలతో నింపుతున్నారు. భోగి రోజున రథం బొమ్మ వేయడం ఆనవాయితీ.

పోటీలతో ప్రతిభకు పదును

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని 120 గ్రామాల్లో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. సంక్రాంతికి పలు సంఘాలు, సంస్థలు నిర్వహించే ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు విశేషంగా పాల్గొంటారు. ఇంటి రహదారి మట్టిదైతే ముగ్గు, పొందర్లతోనూ, సీసీ రోడ్డు అయితే పెయింట్, బ్రష్‌లతోనూ ముగ్గులేస్తున్నారు. ఇంటి ప్రధాన ద్వారాలు వద్ద సంక్రాంతి శుభాకాంక్షలు, స్వాగతం చెబుతూ రంగు రంగుల ముగ్గులనద్దుతున్నారు. మెట్లు, హాలులలో రకరకాల డిజైన్ల ముగ్గులు ఉన్న స్టిక్కర్లను అతికిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లోని నోటు పుస్తకాలను ముగ్గులతో నింపుతున్నారు.

సంస్కృతి, సైన్స్ రెండింటినీ పుణికిపుచ్చుకున్న ముగ్గు

ముగ్గులు అద్దడం వెనుక అనేక శాస్త్రీయ అంశాలు దాగి ఉన్నాయి. వ్యాయామ ఫలితం దక్కడంతో పాటు పరిసరాల పరిశుభ్రం ఉంచడం, సుందరంగా మారడం, కళా నైపుణ్యతను మెరుగుపర్చుకోవడం వంటివి ఉన్నాయి. చుక్కల ముగ్గులు ద్రవిడ సంప్రదాయంగానూ, గీతల ముగ్గు ఆర్య సంప్రదాయంగానూ సూచిస్తాయి. బియ్యపు పిండితో ముగ్గులు వేయడం ద్వారా పురుగు పుట్రాలకు ఆహారం వేయడమనే భావన ఉంది. గతకాలంలో ముగ్గులు ద్వారా జ్ఞానాన్ని అందించారన్న వాదన ఉంది. కొమ్మా, రెమ్మా, పక్షులు, మృగాలు, పురాణ గాథల ఘట్టాలను ముగ్గుల్లో వేసి అవగాహన పెంచేవారు.

చిన్నప్పటి నుంచీ ఆసక్తి



చిన్నప్పటి నుంచీ ముగ్గులపై ఆసక్తి ఎక్కువ. సంక్రాంతికి టేకి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో ముగ్గుల పోటీలను నిర్వహిస్తుంటారు. సందడిగా ఉంటుంది.

– రాపర్తి దేవిక, టేకి, కపిలేశ్వరపురం మండలం

రోజూ ప్రాక్టీస్ చేస్తూ ఉంటా



ధనుర్మాసం కావడంతో న్యూస్ పేపర్లలో రకరకాల ముగ్గులు ప్రచురితమవుతున్నాయి. వాటిని ఆధారంగా చేసుకుని ముగ్గులను ప్రాక్టీసు చేస్తున్నాను. వాటికి రంగులు అద్ది అందమైన రూపాన్ని ఇవ్వడం ద్వారా ఆనందం కలుగుతుంది.

– చీకట్ల యామిని శ్రీవల్లి, టేకి, కపిలేశ్వరపురం మండలం

సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



సంక్రాంతి ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించి వాటిని సంరక్షించాలనే సంకల్పంతో జనవరి 12 నుంచి 14 వరకూ రామచంద్రపురం వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి ఉత్సవ్ 2కే25 పేరుతో మెగా సంబరాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం సంక్రాంతి ఉత్సవ్ 2కే25 పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడారు. తెలుగు ప్రజలకు సంక్రాంతి పండగ చాలా ప్రత్యేకమైందని, సంక్రాంతి పండగ ప్రత్యేకత భావితరాలకు తెలియజేయడంతో పాటు, నియోజకవర్గంలోని ప్రజలంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా సంక్రాంతి పండగ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి ఉత్సవ్ 2కే25 వేడుకలు భోగి మంటలతో ప్రారంభమై మహిళలకు ముగ్గుల పోటీలు, యువతీ యువకులకు సంగీతా విభావరి, పిల్లల మనసును దోచే చూడచక్కని ఆటలు, గోదావరి జిల్లాల ఆత్మీయ ఆతిథ్యాన్ని అందరికీ పరిచయం చేసేలా రకరకాల పిండివంటలు, పిల్లలకు పతంగులు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ కామెడీ షోలు వంటి వినోదభరితమైన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలకు ముగ్గుల పోటీ ఏర్పాటు చేసి బహుమతులు అందజేస్తామన్నారు. మూడు రోజుల పండగ సంబరాల కార్యక్రమాల పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలు ఐక్యతతో, సుఖ సంతోషాలతో జీవించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగే ఈ సంక్రాంతి వేడుకల్లో మహిళలు, పిల్లలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మరుగునపడుతున్న మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు వారసత్వంగా అందించే ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హసన్‌బాదలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభ



హసన్‌బాద గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ సతీష్‌రావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామంలో అనేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తీర్మానాలు చేశారు. సర్పంచ్ సతీష్‌రావు మాట్లాడుతూ గ్రామంలో త్వరలో డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్లతో వ్యర్థాలను డ్రైనేజీలు, ఆరుబయట ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. రానున్న సంక్రాంతి పండగలో కోడిపందాలు, జూదాలు వంటి అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా సంప్రదాయబద్ధంగా చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీలం భవాని, పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్, వీఆర్ఓ సత్తిబాబు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ఆనందబాబు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోనసీమ క్రీడోత్సవాలు



క్రీడా పోటీలకు సిద్ధమైన ఆట స్థలం

మండపేట: కోనసీమ క్రీడోత్సవాలను మంగళవారం నుంచి మండపేటలో నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కే సత్యనారాయణమూర్తి తెలిపారు. ఏడిద రోడ్డులోని వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించే ఈ క్రీడలు మూడు రోజుల పాటు జరుగుతాయని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు క్రీడలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఇందులో నాలుగో తరగతి నుంచి మొదలుకొని 9వ తరగతి విద్యార్థుల వరకూ పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. బాలురకు కబడ్డీ, కోకో, వాలీబాల్, క్రికెట్, బాలికలకు వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాట్మింటన్ పోటీలు ఉంటాయన్నారు. 4, 5, 6 తరగతుల వారికి 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, త్రోబల్ తదితర ఆటలు పోటీలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ళ చేతుల మీదుగా క్రీడలు ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

కోనసీమ క్రీడోత్సవాలను విజయవంతం చేయండి

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో పాఠశాల స్థాయి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. జిల్లా కలెక్టరు డాక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఆదేశాల మేరకు నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఈ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 9.30 గంటలకు కోనసీమ క్రీడోత్సవం , ఆటలతో ఆరోగ్యం క్రీడా పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు.

అందాల పోటీలో తాపేశ్వరం గోవుకు స్థానం



ద్వితీయ బహుమతి గెలుచుకున్న అందాల రాణితో పోషకుడు హరిబాబు

మండపేట: మండపేట పశుపోషణకు పెట్టింది పేరు. ఇక్కడ పశువులు ఎక్కడ పోటీకి దిగినా తామే మహారాణులని చాటి చెపుతాయి. జిల్లాలోనే కాకుండా రాష్ట్రం నలుమూలల ఏ ప్రాంతంలో పోటీలు జరిగినా మండపేట పరిసర ప్రాంతాల నుంచి పశువులను ఆ పోటీలకు దింపడం ఆనవాయితీ. పోటీల్లో అందరి చూపు తమ పశువు వైపు చూసే విధంగా పశువులను సంరక్షించడం, వాటి అందాలను మరింత మెరుగుపరచడం ఇక్కడి పశుపోషకులకు, రైతులకు వెన్నతో పెట్టిన విద్య. ఈ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం కేశనపల్లిలో రాష్ట్రస్థాయి ఒంగోలు, పుంగనూరు, గిర్ ఆవుల అందాల పోటీలు జరిగాయి. ఇందులో మండలంలోని తాపేశ్వరం పశుపోషకుడు కోరా హరిబాబు పెంచిన ఆవు అందాల పోటీల్లో రెండో బహుమతి తెచ్చుకుంది. హరిబాబు మాట్లాడుతూ ఒంగోలు జాతి పోటీల్లో తన ఆవుతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పది ఆవులు పోటీలో పాల్గొన్నాయని అందులో తన ఆవుకు ద్వితీయ స్థానం దక్కినందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

10న వైకుంఠ ఏకాదశి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. పీఠంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవిజయవేంకటేశ్వరస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

మండపేట సీఐగా దారం సురేష్



టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్

మండపేట: టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దారం సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కాగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సురేష్ గతంలో విజయవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ అఖిల్‌జమ ఎన్నికల విధులు నిర్వహించిన అనంతరం వీఆర్‌కు వెళ్లారు. ఏడు నెలల తర్వాత పట్టణానికి కొత్త సీఐగా సురేష్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.

శాస్త్రీయంగా క్రీడా పోటీలు



కపిలేశ్వరపురంలో ఉపాధ్యాయిలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయులతో ఎంపీడీఓ కె.రత్నకుమారి సమావేశమయ్యారు. మంగళవారం నుంచి 9 వరకూ మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన విద్యార్థుల క్రీడాపోటీలను శాస్త్రీయంగా నిర్వహించాలని సంబంధిత ఉపాధ్యాయులను ఎంపీడీఓ కె.రత్నకుమారి ఆదేశించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న పోటీల నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఎంఈఓ కె.తాతారావు మాట్లాడుతూ 4, 5, 6 తరగతుల విద్యార్థులు జూనియర్స్ విభాగంలో రన్నింగ్ పోటీలు, అథ్లెటిక్స్ ఆడనున్నారన్నారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులు సీనియర్స్ విభాగంలో కోకో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

డ్రోన్ సర్వేపై అవగాహన కలిగి ఉండాలి



కోలంకలో డ్రోన్ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కాజులూరు: డ్రోన్ సర్వేపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. కోలంకలో సోమవారం రెవెన్యూ అధికారులు డ్రోన్ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా గతంలో గ్రామంలో నిర్వహించిన డ్రోన్ సర్వే విఫలం కావడంతో మరోసారి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 20 నుంచి డ్రోన్ సర్వే జరుగుతుందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేగేశ్వరరావు, నీటిసంఘం అధ్యక్షుడు దాట్ల విజయగోపాలరాజు, మండల సర్వేయర్ నారాయణమూర్తి, పలువురు స్థానిక నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి 'తోట' పరామర్శ



రాయవరంలో కొల్లి రాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: గ్రామంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సోమవారం పరామర్శించారు. ఇటీవల సతీ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నేత మంతెన అచ్యుతరామరాజును త్రిమూర్తులు పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఇటీవల అనారోగ్యం బారిన పడి కోలుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లి రాంబాబు, అడ్డూరి పెదసూరిబాబులను ఎమ్మెల్సీ త్రిమూర్తులు పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పారిశ్రామికవేత్త తేతల సుబ్బరామారెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పార్టీ నేతలు పడాల కమలారెడ్డి, లాలం సూరిబాబు, మల్లిడి వెంకటరెడ్డి తదితరులున్నారు.

అర్తమూరులో నవగ్రహ నక్షత్ర వనారామ వార్షికోత్సవం



మొక్కలకు పూజ చేస్తున్న బులిస్వామి రెడ్డి, గ్రామ మహిళలు

మండపేట: మానవ మనుగడకు వృక్షాలు చేసే మేలు ఎంతో ఉందని అటువంటి వృక్షాలపై ప్రతి ఒక్కరూ భక్తి ప్రపత్తులతో మెలగాలని ఎస్‌బీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక గ్రామంగా విరాజిల్లుతున్న అర్తమూరులో బులిస్వామి ఆధ్వర్యంలో వనారామం 9వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆయన తల్లిదండ్రులు దివంగత సత్తి లక్ష్మణరెడ్డి, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం గ్రామంలో శ్రీ సత్య లక్ష్మణ నవగ్రహ నక్షత్ర వనారామాన్ని ప్రారంభించారు. వనంలో ఆయుర్వేద గుణాలున్న మొత్తం 56 వృక్షజాతి మొక్కలను దేశవిదేశాల నుంచి రప్పించి నాటారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర రెడ్డి దంపతులు, అనపర్తి హైందవ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రెడ్డి సురేష్ శర్మ, సత్తి బుల్లి స్వామి రెడ్డి శ్రీదేవి దంపతులు, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి కృష్ణవేణి దంపతులు, సత్తి సత్యనారాయణ రెడ్డి లక్ష్మీనారాయణ, పులగం సూర్యనారాయణ రెడ్డి విజయలక్ష్మీ దంపతులు, వెలగల శివారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి, సతీష్, తాడి శ్రీనివాస్ రెడ్డి, బులి సూర్య శ్రీనివాస రెడ్డి, తాడి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాట్లకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరి

కాజులూరు: రైతులు వెదజల్లిక లేదా నారుమడుల్లో విత్తనాలు జల్లేముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన రైతులకు విత్తనశుద్ధి చేసే విధానం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సూడోమోనాస్ ఫ్లోరెసెస్ అను జీవ నియంత్రణ శిలీంధ్రంతో విత్తనశుద్ధి చేసినట్లయితే వరిలో అధికంగా వచ్చే అగ్గితెగులు, మాగుడు తెగులు, పొడ తెగులు రాకుండా 30 నుంచి 40 రోజులు పూర్తిగా రక్షణ కల్పిస్తుందన్నారు. అదే విధంగా ఫాస్ఫో బాక్టీరియా అను భాస్వరపు జీవన ఎరువుతో విత్తనశుద్ధి చేయుట ద్వారా భూమిలో లభ్యం కాని స్థితిలో ఉండిపోయిన భాస్వరాన్ని మొక్కలకు తిరిగి లభ్యమయ్యేలా చేస్తుందన్నారు. అజోస్పైరిల్లమ్ అనే నత్రజని ఎరువు వల్ల ఎకరానికి ఎనిమిది నుంచి 16 కిలోలకు సరిపడా నత్రజని పైరుకు అందుతుందన్నారు. ఎకరానికి సరిపడా విత్తనాలకు 400 గ్రాముల జీవన ఎరువులను బాగా పట్టించి నారుమడి లేదా వెదజల్లిక పొలాల్లో చల్లుకోవాలన్నారు. అలా వీలు కానివారు 20 కిలోల పశువుల ఎరువులోనైనా కలిపి ఎకరం పొలంలో నేలపై జల్లుకోవాలన్నారు.